
# ట్రూడెత్



**గోపరాజు వెంకట నరసింహారావు**

అబ్బా ఏమిటీ వాసన... నాసిక పగిలిపోతోంది... ఒరేయ్ విశ్వనాథ శాస్త్రి తెలుగు కవుల పిచ్చి నీకూ పట్టిందీ... ప్రాసకోసం ప్రయాసపడకు... అనవసరంగా శ్రమపడి సమాసాలు వాడకు... తేట తెలుగులో మాట్లాడు. దేశభాషలందు తెలుగు లెస్... కాదు కాదు లెస్స. భాషాప్రాతిపదికమీద భారతదేశమును విభజించిరి. చిన్నప్పుడు చదివిన గుర్తుంది. ఏ రాయి అయితేనేమి పళ్లూడగొట్టుకోడానికి. నువ్వు అసలు విషయంలోకి రావడంలేదు. పుస్తక పరిజ్ఞానమంతా గుమ్మరించకు. ప్రస్తుతం నిన్ను వేధిస్తున్న సమస్య వాసన. దేశాన్ని వేధిస్తున్న సమస్యలు ఎన్ని? వాటిగురించి క్లుప్తంగా చెప్పుము. ఇంటర్వ్యూలో ఏసీ రూమ్‌లో చల్లగా కూర్చున్న ఏ బేవార్సుగాడో అడగవచ్చు. అవును గుర్తొచ్చింది. ఇంటర్వ్యూకి బయలుదేరిన నేను ఇక్కడికెందుకొచ్చాను? అంతా సస్పెన్స్. అగాథ క్రిస్టీ, ఆర్థర్ కానన్ డెయిల్‌లకు కూడా అంతుచిక్కని మిస్టరీ. ఈ సస్పెన్స్ ఎవరు విప్పుతారు? ఇవేమిట్రా బాబూ ఇవేవో అరల్లాగా ఉన్నాయి. ఈ వాసనతో నా ప్రాణం పోయేలా ఉంది. ఆసుపత్రి వాసన వేస్తోంది. కొంపతీసి ఆసుపత్రిలో చేర్పించారేమిటి నన్ను. ఎస్ మిస్టర్ విశ్వనాథ శాస్త్రీ యూ ఆర్ ఎక్వయిర్డ్ విత్ ఎక్వయిర్డ్ ఇమ్యూన్ డెఫిసియన్సీ సిండ్రోమ్ అని డాక్టర్ బాంబు పేల్చాడు గదా? నా శ్రాద్ధం... నా పిండాకూడు... పిండాకూడు. అవును సుమా మూడురోజుల్నుంచీ కూడులేదు. ఎవడైనా పిండాకూడు పెట్టినా బాగుణ్ను. కడుపులో దేవుతోంది. అందులో పేగులు తప్ప ఏమీలేవు. పేగుల్ని తీగలుగా సాగదీసే ఆకలిరాగం ఆలపిద్దామా? ఆర్ద్ర వీణ పలికే విప్లవ రాగాన్ని విని జనం పరవశించిపోతారు. ఈ దేశంలో విప్లవం రావాలి. విప్లవమే ఈ దేశానికి శరణ్యం. పాపీ విశ్వనాథ శాస్త్రీ బ్రాహ్మణ వంశంలోపుట్టి గాయత్రీ జపం చెయ్యకుండా పచ్చి మంచినీళ్లు కూడా నోట్లోపోసుకోని రామశాస్త్రి కొడుకువైయ్యుండి ఈ విధంగా వ్యర్థ ప్రేలాపనలు పేలుతున్నావా? తరతరాల చరిత్ర ఉన్న వంశాన్ని తగలబెడుతున్నావు. తప్పు నాయనా నువ్వావిధంగా ఆలోచించకూడదు. మరేసుమా తప్పయిపోయింది. ఈ దేశంలో ఆలోచించవలసిన రీతిని జన్మించిన కులం నిర్దేశిస్తోంది. అందుకేరా నిన్ను నాన్న చదివించనన్నాడు. చిన్నప్పుడే గుండు గీయించి, గోష్పాదం పెట్టించి తనక్కూడా తద్దినాలకి భోక్తగా తీసుకుపోతానన్నాడు. నువ్వు వినిపించుకోలేదు. చదువన్నావ్ చట్టుబండలన్నావ్. వీపుగోక్కోవడానికి తప్ప జంధ్యాన్ని మరెందుకూ ఉపయోగించలేదు. బాగా చదువుకుని నిండామునిగిపోయావు. ఇప్పుడు నువ్వు చదువుకున్న పెద్ద పెద్ద పుస్తకాలు నీకు అన్నం పెట్టలేదు. అందులో ఉన్న సిద్ధాంతాలు చెబితే ఎవరూ వినరు. నాన్నలా తద్దినాలకి వెళ్లి ఎవరికీ అర్థం కాని మంత్రాలు చదివితే కనీసం ఆ పిండాకూడైనా దొరికేది. చచ్చి నరకంలో ఉన్న నాన్న అమ్మనీ నన్నూ శాపనార్థాలు పెడుతూనే ఉండి ఉంటాడు. ఆయన ఉచ్చరించేవి మంత్రాలో, తిట్లో, బూతులో ఎప్పుడూ అర్థంకాలేదు. అమ్మకయితే ఇరవై నాలుగ్గంటలూ తిట్లే తిండి. అమ్మ... బ్లడ్‌ప్రెషర్ ఉన్నా రోజూ తెలారా స్నానంచేసి వారానికి అయిదురోజులు ఉపవాసాలుండేది. నాన్న ఎప్పుడైనా మాట్లాడడంటే తిట్ల రూపంలోనే. ఇంట్లో ఎప్పుడూ బియ్యం ఉండదు. ఉన్నదేదో నాకు పెట్టేసేది. తినకపోవడానికి పెట్టిన అందమైన పేరు 'ఉపవాసం' అలా చేయడంవల్ల వచ్చిన పుణ్యం ఎక్కువైపోయి దేవుడి దగ్గరనుంచి నలభై ఏళ్లకే ఆహ్వానం వచ్చేసింది. ఎవరైనా తద్దినానికి పిలిస్తే వెళ్లి వేలుబెడితే అందేలా తిని ఇంటికొచ్చి బోర్లా పడుకునే నాన్న ఎప్పుడూ అమ్మగురించి పట్టించుకోలేదు. పిడుగు పడినట్లు తేనుస్తూ అలా తినడం బ్రాహ్మణుడి ప్రాథమిక హక్కని వేదాల్లో రాసివుందని చిద్విలాసంగా చెప్పేవాడు.

ఫ్లాష్ బేక్‌లొద్దు విశ్వనాథ శాస్త్రీ. నీ ఆటోబయాగ్రఫీ తరువాత తీరిగ్గా పుస్తకంరాయి. ప్రస్తుతంలోకిరా. గతం గతః. ఓహో ఇది రాజకీయం కుళ్లిపోయిన వాసన కావచ్చు. ప్రభుత్వాల వాసన కావచ్చు. ష్... గట్టిగా అనకు. పూర్వంలా అడవుల్లోకి తీసుకెళ్లరు. పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్లరు. పట్టపగలు రోడ్డుమీద నక్సలైట్‌వని కాల్చేస్తారు.

వాసన గురించి ఆలోచిస్తూంటే కేసు ముందుకు సాగడంలేదు. లేచి కూర్చోడానికి కళ్లు తెరవడానికి ఓపికలేదు. పైనా కిందా అరల్లాంటివే ఉన్నాయని చేతులు కదులుస్తుంటే తెలుస్తోంది. ఇది రైలు కాదు కదా? కుషన్లు లేవు కనుక జనరల్ కంపార్ట్‌మెంట్‌గా ఊహించవచ్చు. కాని ఇది కదులుతోందా? కదులుతుంటే ముందుకు కదులుతోందా? వెనక్కి కదులుతోందా? ఈ ప్రపంచంలో కదిలేదీ కదిలించేదీ ఏమీ లేదు. అంతా మిథ్య. నువ్వు లేవు. నేను లేను. రైళ్లు అసలే లేవు. నిజమే లేదనుకోవడం చాలామంచిది. రైలు లేదు అనుకుంటే దాదర్ ఎక్స్‌ప్రెస్ లేదు. కాకతీయ ఎక్స్‌ప్రెస్ లేదు. రైళ్లు ఉన్నాయనుకుంటే అందులో జరిగిన రేప్‌లూ, దహనకాండలూ కూడా ఉన్నాయనుకోవాలి. పోనీ జనరల్ కంపార్ట్‌మెంట్ అని ఒప్పుకున్నా టీకుర్రాళ్ల కేకలు, ముష్టివాళ్ల దీనాలాపాలు వినబడ్డంలేదేమిటి? చెవుడొచ్చిందా? భలే ఆయిడియా వచ్చింది. కళ్లూ, చెవులూ లేకపోతే ఈ ప్రపంచంలో హాయిగా బ్రతకొచ్చు.

లాభం లేదు చేతులకే పని చెప్పాలి. కింద అరలో ఏమిటిదీ? స్త్రీస్తనాలు కదా? మరి రాళ్లలా ఉన్నాయేమిటి? అరే స్త్రీయే. కాని కోమలంగా సుకుమారంగా ఉండవలసిన శరీరం మొత్తం రాయిలా ఉందేమిటి? అజంతా, ఎల్లోరా, ఖజరహో శిల్పాలనీ తీసుకొచ్చి ఇక్కడ పడేశారు కాబోలు. చచ్చిన శవం కాదుకదా? ఛీ ఛీ వాక్యం తప్పు. చిన్నప్పుడు తెలుగు సరిగ్గా నేర్చుకోలేదు. తెలుగు మాస్టారు పాఠం చెబుతున్నప్పుడు ఊగే ఆయన పిలకని చూసి ఆనందించడంతోనే సరిపోయేది.

పక్క అరలో ఒక స్త్రీ ఉందన్నమాట. భలే మంచి తరుణం. ఆలస్యంచేస్తే ఆశాభంగం? దేనికి ఆశాభంగం? ఒక స్త్రీపక్కన ఉందంటే చాలు మనస్సు లోపలి పొరల్లో ఏమిటీ కదలిక? ఎవరో రాక్షసుడు మనస్సులోంచి నిద్రలేస్తున్న భావం కలుగుతోంది ఏమిటి? అది లిబిడో కావచ్చు. మహానుభావుడు ఫ్రాయిడ్ చెప్పిన వెర్రికోరికల పుట్ట అదే కాబోలు. మనిషన్నవాడి ప్రతిలోపల పిచ్చికోరికల సెల్ ఒకటి ఉంటుంది. అవకాశం కోసం ఎదురుచూస్తూ అది రాగానే మానవుడి మెదడుని తన కంట్రోల్‌లోకి తీసుకుని చెడ్డపనులు చేయిస్తుంది.

ఒక్కసారి ఆ పని కాస్త కానిచ్చేస్తే? శవమయినా ఫర్వాలేదు. అమ్మో ఇలాంటి దానికి డాక్టర్లు పెట్టిన పేరు నీక్రోఫిలియా. అంటే స్వచ్ఛమైన తెలుగులో చెప్పాలంటే శవాలతో సంభోగం చేసేవాడు. ఏం ఫర్వాలేదురా విశ్వనాథ శాస్త్రీ డాక్టర్లు ఏ పేరు పెట్టినా ఫర్వాలేదు. ఒక్కసారి ఆ ఆనందం అనుభవించిన తరువాత జీవితం ధన్యమైపోతుంది. రజనీష్ ఇదే సంగతి చెప్పాడు. కోరికలను అణచుకోవడం వల్ల చాలా ఇబ్బందులున్నాయి. ఏం పని చెయ్యాలనుకున్నావో అది చేసెయ్యి. కట్టుబాట్లు, నీతినియమాలు ఈ వెధవ వ్యవస్థవేసిన సంకెళ్లు, అవన్నీ తెంచుకుని స్వేచ్ఛగా జీవించు, అప్పుడు మోక్షం లభిస్తుంది. జిడ్డు కృష్ణమూర్తి పేరులో జిడ్డు ఉందికాని ఆయనా బాగానే చెప్పాడు. భగవద్గీతని తగులబెట్టమన్నాడు. సర్వేపల్లి రాధాకృష్ణ మాత్రం ఏమిటో మన కల్చరూ, కాకరకాయ, హెరిటేజ్ అంటాడు.

స్త్రీపురుషుల కలయిక గురించి సోమర్‌సెట్ మామ్‌ని అడిగితే ఏం చెబుతాడు? సుభాష్ చంద్రబోస్, కట్టమంచి రామలింగారెడ్డి అభిప్రాయం అడిగితే మంచిది. వీళ్లందరి అభిప్రాయాలూ సంకలనం చేసి పుస్తకం ముద్రిస్తే మరీ మంచిది. కాని వాళ్లందరూ చచ్చిపోయారు కదా? నువ్వు కూడా చచ్చిపోతావు కదా? అప్పుడు ఆ పని చెయ్యొచ్చు. కాని వాళ్లు స్వర్గానికెళ్లారో నరకానికెళ్లారో ఎలా తెలుస్తుంది? అసలు స్వర్గం–నరకం ఉన్నాయా? వీళ్లల్లో సుభాష్ చంద్రబోస్ చచ్చిపోలేదంటారు. మరి ఎముకలు ఎవరివి? వల్లకాట్లో రామనాథానివి అవన్నీ మనకెందుకు?

ఓపిక తెచ్చుకుని కళ్లు తెరిచినా ఏమీ కనబడ్డంలేదు. అంతా అంధకారం. ఇలాంటి అంధకారంలోనే అర్ధరాత్రి స్వతంత్రం వచ్చింది. అప్పుడు మెలుకువగా ఉండే గూండాలు, రౌడీలు, దొంగలు ఆ స్వతంత్రాన్ని రేప్ చేసేశారు. కాకులని కొట్టి గద్దలకు వేసినట్లు అయింది మన వ్యవహారం. మనకు మనవాళ్ల నుంచి ఎప్పుడు స్వాతంత్ర్యం వస్తుంది? ఇరవై ఒకటో శతాబ్దంలోనా?

ఈ అంధకారం వీడేదెప్పుడు. ఈ చీకటి గోడలు కూలేదెప్పుడు? ఏమిటో అనుకుంటున్నావు కానీ విశ్వనాథ శాస్త్రీ నీ జన్మకు కారణం ఈ అంధకారమే. ఒక చీకటిరాత్రి వీర్యంలోని జీవకణాలు ప్రయాణంచేసి స్త్రీ విడుదలచేసిన అండంతో కలసి పిండంగా రూపుదిద్దుకుని ఎబ్‌డామెన్ ప్రెయినేజీలోంచి బయటికొచ్చావు ఏడుస్తూ. చుట్టూ చీకట్లని తిట్టుకుంటూ కూర్చోకు. ఒక్క చిన్న దీపం వెలిగించు. నీ జన్మను సార్థకం చేసుకో. ఈ దేశంలో తిండి మాత్రమే దొరకదు. మోక్షానికి లక్ష సిద్ధాంతాలున్నాయి. అందుకోసమే కాబోలు సమానత్వం కోసం పక్కవాళ్ల సిద్ధాంతాలు అరువు తెచ్చుకోవాల్సి వచ్చింది. అనవసరపు ఆలోచనలతో కాలాన్ని వృథాచెయ్యకు. ప్రస్తుతం నువ్వెక్కడున్నావో చెప్పలేని వాడివి దేశాన్నే కించపరుస్తున్నావు. దేశద్రోహీ నీకు ఉరిశిక్ష వేయబడుతుంది. దేశాభిమానం ఉండాలని కవులందరూ చెబుతున్నా అది నీకు ఏమాత్రం ఎక్కదేమిటి? మనిషికి ఒళ్లంతా విషమైనప్పుడు విషసర్పం కాటువేస్తే పెద్ద తేడా కనబడదుట. రకరకాల సిద్ధాంతాలు నీ రక్తాన్ని విరిచేశాయి.

అయ్యా బాబూ నాకు సిద్ధాంతాలూ, శ్రాద్ధాలు ఏవైనా ఫర్వాలేదు. నా చదువుకు తగ్గ ఉద్యోగం కావలయును. ఉద్యోగం అవసరంలేదు. పూటకింత తిండి కావాలి. మానవ శరీర నిర్మాణం చాలా గొప్పగా జరిగింది కాని ఈ 'ఆకలి' అన్నది లేకపోతే ఎంత బాగుండేది. నాయనా చిన్నప్పుడు భౌతికశాస్త్రంలో చదువుకోలేదా? ఏ పనిచెయ్యాలన్నా కొంత శక్తి అవసరం. ఆ శక్తి రావడానికి కొంత ఇంధనం అవసరం. మనిషి బ్రతకడానికి ఇంధనం అవసరం. ఆ ఇంధనం కొరకు ధనం అవసరం. ఈ భూమి తనచుట్టూ తాను తిరుగుతూ ధనం చుట్టూ తిరుగుతోంది. ఈ విశాల విశ్వంలోని ప్రతి అణువు కదలికని ధనం కంట్రోల్ చేస్తోంది. ఆ ధనం కొంతమంది చేతుల్లోనే ఒదిగిపోయింది. కారల్ మార్క్స్ ఏమన్నాడంటే...

అబ్బ లైట్లు వచ్చాయి. అయ్య బాబోయ్... ఇదేమిటి?... ఇవన్నీ శవాలు... శవాలమధ్య జీవచ్ఛవంలా ఇంతసేపు ఉండడం జరిగింది. వీళ్ల దుంపతెగా ఇది ఆసుపత్రి మార్చురీ. శవములను భద్రపరచు గది. పందికొక్కులు, ఎలుకలు వీరవిహారం చేయుస్థలం. ఇంటర్వ్యూకని బయలుదేరి నీరసంతో కళ్లు తిరిగి పడిపోతే ఆసుపత్రిలో చేర్చి ఉంటారు ఎవరో మహాత్ములు. ప్రైవేట్ ప్రాక్టీసుకి అర్జంటుగా ఇంటికి వెళ్లిపోతున్న ఏ డాక్టరో చెక్ చేసి గుండె కొట్టుకోవడంలేదని సర్టిఫికెట్ ఇచ్చి ఉంటాడు. వేద పునీతమైన భారతదేశమా నీకు నా నమస్కారములు. కోట్లాది భారత ప్రజలారా మీకు నా శుభాకాంక్షలు. బురదలో పందుల్లా, నూతిలో కప్పల్లా అలాగే బ్రతకండి. నాకేమవుతోంది?! నాకు ఏదో అవుతోంది. ఇప్పుడు నేను నిజంగా చచ్చిపోతున్నాను. డాక్టర్ గౌరవం నిలబెట్టడానికి చచ్చిపోతున్నాను. ఇది ట్రూ డెత్!